క్లుప్తంగా

రేపు ఉచితంగా రేబిస్ టీకాలు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రపంచ పశువైద్య దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 27న పట్టణంలోని పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తున్నట్లు పశు వైద్యాధికారి విజయ్ తెలిపారు. ఈ మధ్య కాలంలో కుక్కల దాడుల్లో చాలామందికి ప్రమాదాలు జరుగుతుండటంతో రేబిస్ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా కుక్కలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ వైద్యశిబిరం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యువత సత్ప్రవర్తన కలిగి ఉండాలి

కెరమెరి: యువకులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని బదంత్ బుద్ధఘోష్ అన్నారు. మండల కేంద్రంలో ఈ నెల 29న అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలోని వేదం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన శ్రావనీర్ శిబిర్‌లో పాల్గొని ఉపదేశమిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. బుద్ధవందనం ఆలపించారు. శిబిర్‌లో 45 మంది శ్రాంనీర్, శ్రావనీర్‌లు శిక్షణ పొందుతున్నారు. శైలేందర్, మహేందర్, శివాజీ, రమేశ్, అంబాదాస్, ధన్‌రాజ్ ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

కాగజ్‌నగర్‌రూరల్: కోరం లేకపోవడంతో మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. గురువారం సమావేశం ఏర్పాటు చేయగా, ఎంపీటీసీ సభ్యులు ఎవరూ కూడా హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రమేశ్ ప్రకటించారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పెంచికల్‌పేట్: మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం పెంచికల్‌పేట్ ఎంపీపీ జాజిమొగ్గుల సుజాత అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరవడంతో వాయిదా వేసినట్లు ఎంపీపీ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండలంలోని నంబాలలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. గ్రామంలోని వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఇంటర్‌లో విద్యార్థిని ప్రతిభ

ఆసిఫాబాద్: ఇంటర్ ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని శ్రీరాంభట్ల శ్రీకృతి ప్రతిభ చాటింది. జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీరాంభట్ల సునీల్ కుమార్, నీతా దంపతుల కుమార్తె శ్రీకృతి హైదరాబాద్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఇంటర్ ఫలితాల్లో 467/470 మార్కులు సాధించి ప్రతిభ చాటింది.


శ్రీకృతి

బహిరంగ సభకు ఏర్పాట్లు

బెజ్జూర్(సిర్పూర్): మండల కేంద్రంలో ఈ నెల 27న నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పరిశీలించారు. ఈ సభకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఆయన వెంట నాయకులు డోకే వెంకన్న, నరేందర్ ఉన్నారు.

'వేణుకుమార్ గౌడ్ ఆశయాలు కొనసాగిద్దాం'

రెబ్బెన: తెలంగాణ మలిదశ అమరుడు మండల కేంద్రానికి చెందిన తాళ్లపెల్లి వేణుగోపాల్ గౌడ్ ఆశయాలను కొనసాగిద్దామని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద వేణుగోపాల్ గౌడ్ 12వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, ఎంపీటీసీ మదునయ్య, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, నాయకులు ఉన్నారు.

'ఓపెన్' పరీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆసిఫా బాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో రెండు చొప్పున పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓపెన్ టెన్త్‌కు సంబంధించి మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 287 మంది విద్యార్థులకు 254 మంది హాజరు కాగా, 33 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు. అలాగే ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 253 మందికి 221 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబుతోపాటు స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

పునరావాసం ఎప్పుడో..?


తాగునీటి ట్యాంకు


దేవుడ్‌పల్లి గ్రామం

- ఏళ్లు గడుస్తున్నా కనిపించని పురోగతి
- నూతన కేంద్రంలో కానరాని సౌకర్యాలు
- ఇబ్బందుల్లో దేవుడ్‌పల్లి వాసులు

కెరమెరి: కుమురం భీం ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామస్తులకు పునరావాసం కల్పించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టులో భాగంగా మండలంలోని ఇందాపూర్ గ్రామ పంచాయతీ పరిధి దేవుడ్‌పల్లి గ్రామం ముంపునకు గురైంది. గ్రామంలో మొత్తం 70 కుటుంబాలు ఉండగా, 210 జనాభా ఉంది. ప్రస్తుతం ఉన్న గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో నిసాని గ్రామానికి వెళ్లే దారిలో 2011లో పునరావాసం కోసం స్థలాన్ని కేటాయించి అక్కడ 110 ప్లాట్లు తీశారు. ఆ స్థలంలో మురికి నాలాలు సైతం నిర్మించారు. మంచి నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. కానీ ఇంతవరకు ప్లాట్లను కేటాయించలేదు. ఇతర నిర్మాణాలకు కూడా నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

కానరాని సౌకర్యాలు..

దేవుడ్‌పల్లి నుంచి ప్లాట్ల స్థలం వరకు సీసీ రోడ్డు సైతం నిర్మించారు. కానీ విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించలేదు. పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు వంటి నిర్మాణాలు సైతం చేపట్టలేదు. దీంతో ప్రజలు పునరావాస ప్రాంతానికి వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి ఉంది. జిల్లా కలెక్టర్లు పునరావాస కేంద్రాన్ని సందర్శించినప్పుడు వారం రోజుల్లో ప్రజలను షిఫ్ట్ చేస్తామని హామీలు ఇస్తున్నా అవన్నీ నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. దీంతోపాటు ప్రస్తుతం వారు నివసిస్తున్న ప్రాంతం కూడా నివాస యోగ్యంగా లేదు. కేబీ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రస్తుత గ్రామానికి అతి సమీపంలో రావడంతో పాములు, తేళ్లు తరుచూ ఇళ్లలోకి వస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేకాకుండా పునరావాసంలో ముంపునకు గురవుతుండడంతో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. భూగర్భ జలం అధికంగా ఉండడంతో నీరు కూడా తాగేందుకు యోగ్యంగా లేదని స్థానికులు వాపోతున్నారు.


పునరావాస కేంద్రంలో నిర్మించిన డ్రెయినేజీ

సౌకర్యాలు లేవు



ప్రస్తుతం ఉంటున్న దేవుడ్‌పల్లిలో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. మురికి నాలాలు లేవు. ముంపునకు గురైన గ్రామంగా భావించి ప్రస్తుతం ఇక్కడ అభివృద్ధి పనులు చేయడం నిలిపివేశారు. అధికారులు స్పందించాలి.

\- సెంద్రి కమీనాబాయి, గృహిణి

అభివృద్ధి పనులు చేపట్టాలి



పునరావాస కేంద్రంలో విద్యుత్, అంతర్గత రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలి. పాఠశాల, అంగన్‌వాడీ భవనం నిర్మించాలి. కానీ ఏ అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. ఇంతవరకు మాకు ప్లాట్లను చూపించలేదు.

\- జాడి బుర్రు, రైతు

విద్యార్థులు చదువులో రాణించాలి


సన్మానిస్తున్న మాలీ సంఘం నాయకులు

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో రాణించాలని మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు అన్నారు. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన మోర్లె గీత భవానిని మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయిలో ఎదగాలన్నారు. మారుమూల ప్రాంతానికి చెందిన విద్యార్థిని ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 437 మార్కులు సాధించడం గొప్ప విషయమన్నారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆదే శ్రీనివాస్, మోర్లె రమేశ్, సంఘం నయకులు నికోడే హన్మంతు, నగేశ్, బాపురావు, చందు, పండురంగ్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'

తిర్యాణి: కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రావడం ద్వారానే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ నాయకుడు, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి అన్నారు. గురువారం మండలంలోని గోపెర, నాగుగూడ, పునగూడ, కొలంగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆత్రం సుగుణకు ఎంపీగా అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయిసిడాం జలపతి, జాదవ్ ఈశ్వర్, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల పరిశీలకుడిని కలిసిన ఎస్పీ



ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు వచ్చిన ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ జనరల్ ఎలక్షన్ పరిశీలకుడు రాజేంద్ర విజయ్‌ని గురువారం ఎస్పీ సురేశ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు గురించి ఎన్నికల పరిశీలకుడికి వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

మినీ స్టేడియానికి గేట్


గేట్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కౌటాల: కౌటాల మినీ స్టేడియానికి గురువారం పంచాయతీ అధికారులు గేట్ ఏర్పాటు చేశారు. మినీ స్టేడియంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై సాక్షిలో 'మందుబాబుల అడ్డా' శీర్షికన కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. స్టేడియంలోని చెత్తాచెదారం తొలగించారు. ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో రాత్రి వేళ స్టేడియం పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, బొంబాయిగూడ, ఎల్కపల్లి, అగర్‌గూడ, గుండెపల్లి, కమ్మర్‌గాం, మొరలిగూడ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం కాగజ్‌నగర్‌రూరల్ సీఐ అల్లం రాంబాబు, ఎంపీడీవో అల్బర్ట్‌తో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట ఎస్సై కొముర‌య్య తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రాంబాబు

అగర్‌గూడలో ఎన్నికల ప్రచారం

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ, కమ్మర్‌గాం, మొరలిగూడ గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ సిర్పూర్(టి) నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట నాయకులు సంజీవ్, రాజన్న, సుధాకర్, సాజిత్, బండు, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రావి శ్రీనివాస్

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

రెబ్బెన: గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలకు ప్రగతికార్డులు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ మంజుల మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఏప్రిల్‌లో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రైమరీ పాఠశాలకు అర్హత పొందిన పిల్లల కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆయా లత, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వాంకిడి: పేకాట ఆడుతున్న పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జైత్‌పూర్ పంచాయతీ పరిధిలోని బోర్ద గ్రామ శివారులో గురువారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడులు చేసి పేకాట ఆడుతున్న పది మందిని అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.3530 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మలేరియా నివారణకు కృషి చేయాలి

బెజ్జూర్: మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యులు అవినాష్, వెంకటేశ్వర చారిలు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మలేరియా వ్యాధి లక్షణాలు నిర్మూలన కోసం తీసుకోవాల్సిన చర్యలతో పాటు కుష్టు వ్యాధికి సంబంధించిన లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎల్‌టీ దిలీప్, హెచ్‌ఈవో శ్యామ్‌లాల్, ఫార్మసిస్ట్ ఆయేషా, ఏఎన్‌ఎంలు రాంబాయి, భాగ్య, సునీత, కృష్ణవేణి, ఎంఎల్‌హెచ్‌పీ సుచరిత, లేప్రా సొసైటీ రాజు, పీహెచ్‌ఎన్ కమల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


దహెగాం: మలేరియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్పందన

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు, కుంచవెల్లి, ఇట్యాల, హత్తిని, తదితర సబ్‌సెంటర్‌లలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిని స్పందన మాట్లాడుతూ మలేరియా దోమకాటు వల్ల వస్తుందన్నారు. జ్వరం వచ్చినప్పుడు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని పేర్కొన్నారు. ఇంటి పరిసరాలతో పాటు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. దోమకాటు వల్ల వచ్చే వివిధ రకాల వ్యాధులపై వివరించారు. సబ్‌సెంటర్ వైద్యాధికారులు సంపత్, రవళి, నరేందర్, మల్లికార్జున్, జ్యోతి, కీర్తి, వైద్య సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మలేరియా దినోత్సవం

లింగాపూర్: మండల కేంద్రంలో గురువారం మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వనతా, ల్యాబ్ అసిస్టెంట్ అశోక్, ఈశ్వర్ పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మలేరియాపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. మలేరియా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హెచ్‌ఈవో సోనాజీ అన్నారు. డబ్ల్యూహెచ్‌వో పిలుపు మేరకు 2030నాటికి మలేరియా నిర్మూలనకు కలిసి పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


బెజ్జూర్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


లింగాపూర్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు


కౌటాల: అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ముగిసిన మహంకాళి జాతర


మహంకాళి విగ్రహాన్ని గంగ స్నానానికి తీసుకెళ్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్ స్వయంభూ మహంకాళి ఆలయంలో చైత్ర పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న అమ్మవారి జాతర గురువారం ముగిసింది. చివరిరోజు అమ్మవారి ఉత్సవ విగ్రహాలను డప్పువాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య ప్రత్యేక పల్లకిలో సమీప వాగుకు తీసుకెళ్లి గంగ స్నానం చేయించారు. అనంతరం ఆలయంలో దూపదీప నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు గంగస్నానం, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కోరుకున్న కోరికలు తీరాలని అమ్మవారికి ముడుపులు కట్టారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావుతో పాటు కాంగ్రెస్ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు


అమ్మవారికి ముడుపులు కడుతున్న భక్తులు

పారిశుధ్య పనుల నిర్వహణ

లింగాపూర్: మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. ప్రధాన వీధుల్లో గల డ్రెయినేజీలు ప్లాస్టిక్ కవర్ల కూరుకుపోయాయి. దీంతో మురుగు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోడ్ల పక్కన చెత్త ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్ గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు.


చెత్త తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది